ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 22 జూలై 2024 | 5



ఉధృతంగా...



కోటిపల్లి వద్ద పుష్కరాల రేవు మెట్ల వరకు చేరిన వరద నీరు

- భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఎనిమిది లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- పొంగుతున్న కాజ్‌వేలు... రేవులో ప్రయాణాలు రద్దు



అయినవిల్లిలంకలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

అమలాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఆదివారం రాత్రికే భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయడంతో కోనసీమ జిల్లా పరిధిలోని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందన్న జలవనరుల శాఖ అధికారుల అంచనాలతో కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ, వృద్ధగౌతమి నదీపాయల వెంబడి ఉన్న లంక గ్రామాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ముక్తేశ్వరం-కోటిపల్లి, సఖినేటిపల్లి-నర్సాపురం రేవులతో పాటు జిల్లాలో ఉన్న పదమూడు రేవుల్లో పంటు, పడవ ప్రయాణాలపై ఆంక్షలు విధించడంతో నిలిచిపోయాయి. కోనసీమలోని వివిధ ప్రాంతాల్లో కాజ్‌వేలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు కాజ్‌వే అయిన చాకలిపాలెం-కనకాయలంక వరద ఉధృతికి గురి కావడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మిగిలిన ప్రాంతాల్లో క్రమంగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా లంక గ్రామాల ప్రజలు పశువులను ఏటిగట్లకు తరలించే పనిలో ఉన్నారు. ఇప్పటికే ఎక్కడికక్కడే ఉన్న కొబ్బరి రాశులను ఆగమేఘాలపై తరలిస్తున్నారు. ఈసారి వరద ఉధృతి తీవ్రంగా ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కూడా తీవ్రస్థాయిలో కురుస్తుండడంతో వరద ప్రవాహం పెరిగి లంక గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలిగించే పరిస్థితులు ఉన్నాయి. ఎక్కడికక్కడే లంక గ్రామాల ప్రజలు ముందు జాగ్రత్తల్లో నిమగ్నమయ్యారు. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను రెవెన్యూ ఉన్నతాధికారులు పరిశీలించి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై హెడ్‌వర్క్స్ అధికారులకు సూచనలు చేస్తున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జిల్లాలోని అన్ని ప్రాంతాలు జలదిగ్బంధానికి గురికావడంతో పాటు నేల అంతా చిత్తడిగా మారి అపరిశుభ్ర వాతావరణం రాజ్యమేలుతోంది. దాంతో ఆయా ప్రాంతాల ప్రజలు అంటు వ్యాధులు ప్రబలుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతిపై కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై నిరంతరం సమీక్షిస్తున్నారు.



మామిడికుదురు మండలం పెదపట్నంలోని మధ్య లంక నుంచి పశుగ్రాసాన్ని ఒడ్డుకు చేర్చుకుంటున్న రైతులు

రానున్న 48 గంటల్లో భారీ వర్ష సూచన

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) రద్దు
- కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రానున్న 48 గంటల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికతో కోనసీమ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సోమవారం జిల్లా పరిధిలోని అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్)ను కూడా రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది. దీనికి తోడు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సూచించారు. జిల్లా పరిధిలోని వరద ప్రభావిత డివిజన్ల పరిధిలోని మండల, గ్రామస్థాయి అధికారులతో ఆదివారం కలెక్టర్ మహేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ దిగువున 7.5లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, ఆదివారం రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. సోమవారం ఉదయానికి వరద ఉధృతి దృష్ట్యా రెండో ప్రమాద హెచ్చరిక కూడా విడుదల చేసే అవకాశం ఉన్న దృష్ట్యా అధికారులంతా అప్రమత్తతతో పని చేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. రానున్న మూడు రోజులు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాద హెచ్చరికల నేపథ్యంలో ముంపు బారిన పడే గ్రామాల జాబితాను సిద్ధం చేసుకుని బాధితులకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో బాధితులను పడవలపై తరలించేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని మండల స్థాయిలో నియమితులైన ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బందిని కూడా వరద సహాయ కార్యక్రమాలకు ఉపయోగించాల్సిందిగా సూచించారు. వర్షాలు, వరదలకు ఉత్పన్నమయ్యే ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధం కావాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు.

నేడు అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు

అమలాపురం టౌన్, జూలై 21: జిల్లాలో విపరీతంగా కురుస్తున్న వర్షాలు, గోదావరి వరదల కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు. జిల్లా, మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక సూచనలు చేశారు. వర్షాల కారణంగా పాఠశాల పరిసరాలు పాడైపోయే అవకాశం ఉన్నందున పరిశుభ్రతకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల భవనాల ధృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించరాదన్నారు. ప్రస్తుత సెలవు దినాలకు తదుపరి వచ్చే ప్రభుత్వ సెలవు దినాల్లో ఆయా పాఠశాలలు పని చేయాల్సి ఉంటుందని డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి శిక్షా సప్తాహం

అమలాపురం టౌన్, జూలై 21: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 'శిక్షా సప్తాహం' నిర్వహించాలని డీఈవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధనాభ్యాసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించాలి. 23న సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి, సమాజ భాగస్వామ్యంపై అవగాహన, 24న క్రీడాదినోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి శరీర సౌష్టవం ప్రాముఖ్యతను వివరించాలి. 25న సాంస్కృతిక దినోత్సవంలో భాగంగా విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వభావాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించాలి. 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర, పాఠశాలల్లో పోషణ దినోత్సవ నిర్వహణ, ఎకో క్లబ్‌ల ఏర్పాటు, అమ్మపేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకు అంకితమిచ్చే కార్యక్రమం, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం, విద్యార్థుల సహపంక్తి భోజనం, తల్లిదండ్రుల కమిటీల ఏర్పాటు నిర్వహించాలని కోరారు.



ముమ్మిడివరం మండలం కొత్తలంకలో ముంపు బారిన పడిన వరి పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



రావులపాలెం మండలం ఈతకోట వద్ద గోరింకల డ్రెయిన్ సమీపంలో ముంపు నీటిలో పంట పొలాలు



పి.గన్నవరం హెడ్‌వర్క్స్ కార్యాలయంలో సిద్ధం చేసిన ఇసుక బస్తాలు

కనకాయలంక కాజ్‌వేను ముంచెత్తిన వరద నీరు

- లంక గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- దొడ్డిపట్ల రేవుకు రాకపోకలను నిషేధించిన అధికారులు



చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపై వరద నీటిలో ఇవతలి ఒడ్డుకు వస్తున్న చిన్నారులు, వరద నీటిలో కొబ్బరి కాయల లోడుతో వస్తున్న ట్రాక్టరు

పి.గన్నవరం, జూలై 21: ఎగువ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా పెరుగుతున్న వరద ఉధృతితో దిగువున నదీపాయలు పరవళ్లు తొక్కుతున్నాయి. ధవళేశ్వరం నుంచి దిగువకు వరద నీటిని సముద్రంలోకి వదలడంతో నెమ్మదిగా నదీపాయల నుంచి లంకల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దు ప్రాంతమైన చాకలిపాలెం వద్ద కాజ్‌వేపై వరద నీరు చేరడంతో లంక గ్రామస్తులకు ఇక్కట్లు మొదలయ్యాయి. ప్రస్తుతం పడవలు తిరిగే పరిస్థితి లేకపోవడంతో వరద నీటి ఉధృతిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. లంకల్లో ఉన్న కొబ్బరి కాయలను రైతులు వివిధ వాహనాలపై ఇవతలి ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. అయితే కాజ్‌వే వద్ద ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లా అధికార యంత్రాంగం రెవెన్యూ, పోలీసు అధికారులను నియమించ డంతో పాటు ఇంజన్ పడవలను అందుబాటులో ఉంచింది. కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోవడంతో దొడ్డిపట్ల రేవును సైతం తాత్కాలికంగా మూసివేశారు. కె.ముంజవరంలో వంతెన శిథిలావస్థకు చేరడంతో కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పరిశీలన చేసి వంతెనపై వాహనాల రాకపో కలను నిషేధించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతరం లంక గ్రామాల్లో వరద ప్రభావంపై సంబంధిత వీఆర్వోలతో ఆర్డీవో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై అత్యవసర సూచనలు చేశారు. బలహీన ఏటిగట్లకు వరద ప్రవాహంతో ఇబ్బందులు ఏర్పడితే ముందస్తుగా ఇసుక, ఇసుక బస్తాలు, సర్వే కర్రలను ఏఈఈ రాధాకృష్ణ ఆధ్వర్యంలో పి.గన్నవరం హెడ్‌వర్క్స్ కార్యాలయం వద్ద సిద్ధం చేశారు. గంటి పెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు గ్రామాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలు లంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.



శాకంబరిగా రావులమ్మ అమ్మవారు

ఆలమూరు గ్రామ దేవత రావులమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా భక్తులు సమకూర్చిన సుమారు 400 కిలోల వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు వేదుల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో పలువురు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

.... ఆలమూరు



సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై

గురు పౌర్ణమి పర్వదినాన్ని ఆదివారం జిల్లా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. షిర్డిసాయి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు... కె.గంగవరం మండలం పాణింగపల్లిలో సాయినాథునికి అభిషేకం చేస్తున్న అర్చకస్వామిని పై చిత్రంలో చూడొచ్చు.... 8లో

గోదావరి ఉగ్రరూపం



ధవళేశ్వరం వద్ద గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

- కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లు ఎత్తివేత
- 8,63,535 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా..
- చింతూరువద్ద శబరి నీటి మట్టం 39 అడుగులు
- భద్రాచలంవద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ఎటు చూసినా వరద నీరే ● నిలిచిన రాకపోకలు

ధవళేశ్వరం, జూలై 21: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద ప్రవాహానికి తోడు దిగువన కుంట వద్ద ఉపనది శబరి నుంచి వరదనీరు గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా నీటిమట్టం పెరుగుతోంది. దీంతో కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను పూర్తిగా ఎత్తివేసి(ఆల్‌క్లియర్ పొజిషన్) ఎగువ నుంచి వస్తున్న నీటిని వస్తున్నట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి 12 గంటలకు కాటన్ బ్యారేజ్ నుంచి 8,63,535 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఈ సమయంలో నీటిమట్టం 10.80 అడుగులుగా నమోదైంది. నీటి మట్టం వేగంగా పెరుగుతుండడంతో సోమవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు నీటిమట్టం చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద ఆదివారం రాత్రి 12 గంటలకు 45 అడుగులకు నీటిమట్టం చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు చింతూరు ఆర్డీవో సంబంధిత అధికార్లకు గోదావరి-శబరివరదల పేరిట సమాచారంఅధికారికంగా అందించారు.



వరద నీటిలో ఇళ్లకు చేరుకుంటున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థినీలు

వరద నీటిలోనే ఇళ్లకు విద్యార్థినులు

చింతూరు, జులై 21: పాఠశాలలకు సెలవులు కేటాయించడంతో పలువురు విద్యార్థులు వరద నీటిలో ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం ఈ ఘటన చింతూరులో చోటుచేసుకుంది. వరరామచంద్రపురం మండలంలోని సున్నవారిగూడెం ఆశ్రమ పాఠశాలతో పాటు కూనవరం మండలంలోని ఆదిమ గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులను ఈ రోజు వారి ఇళ్లకు వెళ్లాల్సిందిగా సంబందిత వసతి గృహ హెడ్‌మాస్టర్, ప్రిన్సిపాల్‌లు సూచించారు. దీంతో విద్యార్థులు పలువురు వయా చింతూరు మీదుగా వారి ఇళ్లకు చేరుకోవాల్సి వచ్చింది. కాగా వారంతా నీటమునిగిన 30 నెంబరు జాతీయ రహదారి మీదుగా ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదభరితమైన ఈ తరహా ప్రయాణం సరికాదంటూ సోషల్‌మీడియాలో పలువురు పాఠశాలల బాధ్యుల తీరుపై పెదవి విరిచారు. వారి తల్లిదండ్రుల అభీష్టం మేరకే, అదే దశలో వారి తల్లిదండ్రులతో పాటే తాము ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులకు అనుమతి ఇచ్చామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపల్ చెప్పుకొస్తున్నారు. ఈ విషయమై చింతూరు ఏటీడబ్ల్యువో (అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి) సుజాతను ఆంధ్రజ్యోతి వివరణ కోరారు. ఈ మేరకు స్పందించిన ఏటీడబ్ల్యువో సుజాత మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు వారి ఇళ్లకు వరద నీటిమీదుగా చేరినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సిందిగా సూచించడం జరిగిందని కాగా ఈ విధంగా వరద నీటిమీదుగా ఇళ్లకు పంపించాలన్న ఆదేశాలు ఏ మాత్రం ఇవ్వలేదని ఈవిషయమై పూర్తిస్థాయిలో సమాచారం తీసుకుంటామన్నారు.

ఏజెన్సీలో ఎడతెరపిలేని వాన

- విలీన మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే శిరీషాదేవి
- పునరావాస ఏర్పాట్లు చేస్తున్నాం : ఐటీడీఏ పీవో



భద్రాచలం చింతూరు జాతీయ రహదారిపై చేరిన వరద నీటిలో చిక్కుకున్న లారీ

చింతూరు, జూలై 21: విలీన మండలాల్లో ఆదివారం రోజంతా చినుకులు పడుతూనే ఉన్నాయి. ఆదివారం ఉదయానికి చింతూరు మండలంలో 48.4 మిల్లీమీటర్లు, కూనవరం 14.8 మిల్లీమీటర్లు, ఎటపాక మండలంలో 15.6 మిల్లీమీటర్లు, వరరామచంద్రపురం మండలంలో 18.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకోగా, భద్రాచలంవద్ద గోదావరి సాయంత్రం ఏడుగంటలకు 43 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ఎగువన వర్షాలు కురుస్తుండడంతో భద్రాచలంలో గోదావరి 48 అడుగుల వరకు చేరుకొనే పరిస్థితి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. చింతూరు మండలంలో కల్లేరు, ఏజీ కొడేరు, ముకునూరు, రామన్నపాలెం, పెద్దసీతనపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు దిగ్బంధమయ్యాయి. వరరామచంద్రపురం మండలంలో సీతంపేట, శ్రీరామగిరి, చిన్నమట్టపల్లి, కన్నాయిగూడెం, తుష్టివారి గూడెం, అడవివెంకన్నగూడెం తదితర గ్రామాల నడుమ రహదారులపై వరదనీరు చేరడంతో అటుగా రాకపోకలు పూర్తిగా నిలచిపోయాయి. దీంతో ఆయా ప్రాంత ప్రజలు నాటు పడవలను ఆశ్రయిస్తున్నారు. కూనవరం మండలంలోని కొండ్రాజుపేట టేకులబోరుల నడుమ రహదారిపై వరద నీరు చేరడంతో దాదాపు 15 గ్రామాలకు నేరుగా ఉన్న రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రాంతవాసులు చుట్టూ తిరిగి మండల కేంద్రమైన కూనవరం చేరుకుంటున్నారు. ఎటపాక మండలంలోని నెల్లిపాక వీరాయిగూడెం గ్రామాల నడుమ రహదారిపై వరదనీరు చేరింది. ఇదే మండలంలోని గన్నవరంలో వర్షం ధాటికి రెండు పెంకుటిళ్లపై పై కప్పు కూలింది. చింతూరులో సంతపాకల ప్రాంతంలో వరద నీరు చేరింది. దీంతో చింతూరు ఒడ్డువాసులు ఇళ్లు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ఎమ్మెల్యే శిరీషాదేవి ఆదివారం విలీన మండలాల్లో పర్యటించారు. ఈ మేరకు వరద పరిస్థితిపై ఆమె ఆరా తీశారు. పలువురు ముంపు బాధితులు తమకు టార్పాలియన్లు ఇవ్వలేదన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన టార్పాలియన్లతోపాటు ఇతరత్రా సదుపాయాలను కల్పించాల్సిందిగా సూచించారు. భద్రాచలం చింతూరుల నడమ రహదారిపై వరదనీరు చేరింది. అదేదశలో చింతూరు మీదుగా ఛత్తీస్‌గడ్ వెళ్లే రహదారిపై సుక్మా జిల్లా ఎర్రబోరువద్ద, చింతూరు మీదుగా ఒడిస్సాకు రహదారిపై కయుగూరు వద్ద వరద నీరు చేరడంతో ఛత్తీస్‌గడ్, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు రాకపోకలు నిలచిపోయాయి. మారేడుమిల్లి, చింతూరు ఘాట్ రహదారిపై వర్షం ధాటికి చెట్టు విరిగి పడుతుండడంతో ఆ దిశగా రాకపోకలు కూడా కష్టతరంగా మారాయి. డొంకరాయి జల విద్యుత్‌కేంద్ర రిజర్వాయరు సామర్థ్యం 1037 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1023 అడుగులకు చేరుకుంది.





గేటు వద్ద మునిగిన ఇసుక నావ, క్రేన్ సహాయంతో నావను లాగుతున్న దృశ్యం

బ్యారేజ్ వద్ద ఇరుక్కున్న డ్రెడ్జింగ్ పడవ

- శనివారం రాత్రి గాయత్రి ర్యాంప్ నుంచి కొట్టుకొచ్చిన పడవ
- బ్యారేజ్ ఒకటో గేటు వద్ద నీట మునక
- పడవను బయటకు తీసే ప్రయత్నాలు విఫలం
- పనులు నిలిపివేత.. నేడు మళ్లీ ప్రయత్నం

ధవళేశ్వరం, జూలై 21: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద డ్రెడ్జింగ్ పడవ ఇరుక్కుపోయింది. గాయత్రి ఇసుక ర్యాంపు వద్ద లంగరువేసిన డ్రెడ్జింగ్ పడవ లంగరుతాడు తెగి గోదావరిలో వరదనీటి వేగానికి కొట్టుకు వచ్చి కాటన్ బ్యారేజ్ ఒకటవ గేటుకు అడ్డంగా మునిగిపోయి గేటును నియంత్రించడానికి అడ్డంకిగా మారింది.శనివారం రాత్రి 10 గంటల సమయంలో నీటిపై తేలుతూ బ్యారేజ్ వద్దకు కొట్టుకువచ్చిన పడవను ఇరిగేషన్ లస్కర్లు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఆ సమయంలో పడవ సొంత దారులు వచ్చి ఆ ప్రాంతంలోని గేట్లను దించితే ఒడ్డుకు లాక్కుంటామని కోరారు. గోదావరి ఉధృతంగా ఉండడంతో వల్ల రాత్రి సమయంలో గేట్లను దింపడానికి అధికారులు నిరాకరించారు. పడవ గేట్ల వద్ద కాంక్రీట్ పిల్లర్‌ను ఢీ కొనడంతో కన్నం పడి నావలోకి నీరు చేరి ఆదివారం ఉదయానికి గేటుకు అడ్డంగా మునిగిపోయింది. ఆదివారం ఉదయం స్థానిక మత్స్యకారులు సహాయంతో నావను బయటకు లాగడానికి ఇరిగేషన్ అధికారులు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. దీంతో కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాలతో ఎన్డీఆర్ఎఫ్ బృందంవచ్చి పరిశీలించింది. సాయంత్రానికి భారీ క్రేన్‌ను రప్పించి పడవను బయటకు తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. చీకటి పడడంతో పనులు నిలిపివేశారు.నీటమునిగిన పడవ ఖరీదు రూ.15 లక్షలు ఉంటుందని సమాచారం.సోమవారం ఉదయం పడవను బయటకు తీసే పనులు చేపట్టనున్నారు.

నీట మునిగిన గండి పోశమ్మ ఆలయం

దేవీపట్నం, జూలై 21: మండలంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన కొండమొదలు, తాళ్ళూరు, కచ్చులూరు, మంటూరు, మడిపల్లి, మూలపాడు, అగ్రహారం, దేవీపట్నం, తొయ్యేరు, పూడిపల్లి, పోశమ్మగండి గ్రామాల్లో వరద నీరు పెరుగుతూ వస్తోంది. గత మూడు రోజుల నుంచి మాతృశ్రీ అమ్మవారి ఆలయాన్ని చుట్టుముట్టి ఆదివారం గోపురం పైభాగం వరకు వరదనీరు చేరింది. తాలిపేరు జలాశయం, శబరి తదితర నదుల నుంచి గోదావరికి వరదనీరు చేరి సీతపల్లి వాగు పోటెత్తడంతో నాలుగు పంచాయతీలకు ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

శాకంబరిగా రత్నగిరి దుర్గలు



శాకంబరి అలంకారంలో దర్శనమిస్తున్న వనదుర్గ

అన్నవరం, జూలై 21: ఆషాఢపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని రత్నగిరి రక్షకిలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గ, గ్రామదేవతలైన నేరేళ్లమ్మ, మరిడమ్మ, వాసవీమాతలు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవార్లను దేవస్థానం ఆధ్వర్యం లో ఆయా ఆలయ కమిటీల పర్యవేక్షణలో వివిధ రకాలైన కూరగాయలతో అలంకరించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి కరువు కాటకాలు దరిచేరకూడదని ఈ శాకంబరి అలంకారం నిర్వహిస్తుంటారు.

వైభవంగా సత్యదేవుడి మహావ్రతం



సప్తవర్ణ శోభిత బీజాక్షరాలతో భారీ మహానారాయణ యంత్రం

అన్నవరం, జూలై 21: సత్యదేవుడి సన్నిధిలో స్వామివారి మహావ్రతం ఆదివారంతో ముగిసింది. శనివారం ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. దేవస్థానంతో సంబంధం లేకుండా అవదూత దత్తమణి పర్యవేక్షణలో దీనిని నిర్వహించారు. 116మంది రుత్విక్‌లతో 333 చదరపు అడుగుల విస్తీర్ణంలో వృత్తాకారంలో భారీ మహానారాయణ యంత్రాన్ని వివిధ మంత్రోచ్చరణలతో ఏర్పాటుచేసి సప్తవర్ణశోభితంగా అలంకరించి పూజలు నిర్వహించారు. 1500గ్రాముల వెండి అష్టలక్ష్మీ కలశం మధ్యలో ఉంచి పూజలు చేశారు. అనంతరం ఈ కలశాన్ని దేవస్థానంకు బహూకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. గోత్రనామాలతో కాకుండా లోకకల్యాణమే హద్దుగా నిర్వహించామని దీనివలన క్షేత్రవృద్ధి జరుగుతుందన్నారు.

70 వేల ప్యాకెట్ల సత్యదేవుడి ప్రసాదం విక్రయాలు

తులపులమ్మ లోవ దర్శనానికి వెళ్లి తిరుగుప్రయాణంలో వెళ్లే ఉమ్మడిగోదావరి జిల్లాల లోవ భక్తులు ఆదివారం జాతీయరహదారిపై నమూనాలయం, తొలిపావంచా వద్ద సత్యదేవుడి ప్రసాదాలు కొనుగోలు చేయడంతో రద్దీ నెలకొంది. ఆదివారం ఒక్కరోజు కొండదిగువన కొండపైన సుమారు 70వేలప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు.

కేంద్ర పర్యాటక శాఖ మంత్రితో దుర్గేష్ భేటీ

- రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిపై చర్చ



కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 21: రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా పలు ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై కేంద్ర పర్యాటక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను ఢిల్లీలో కలిసినట్టు రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధిపై చర్చించినట్టు చెప్పారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి పలు ప్రాజెక్టులు చేపట్టేందుకు అనువైన ప్రదేశాలున్నాయని తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని దుర్గేష్ అన్నారు. ఇదిలావుండగా ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కాల్ కాన్ఫరెన్స్ నిర్వహించి నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో అధిక వర్షాలు వరదలపై జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి నుంచి జిల్లా యంత్రాంగం వరకు ప్రజలకు అందు బాటులో ఉంటూ పునరావాస కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

న్యాయవాదులు వృత్తిలో నిబద్ధతతో పనిచేయాలి

- టీఎస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావునాయుడు



జస్టిస్ సాంబశివరావు నాయుడును సత్కరిస్తున్న బార్ అసోసియషన్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21: న్యాయవాదులు వృత్తిలో నిబద్ధతతో పనిచేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనం, బుచ్చిరాజు కల్యాణవేదికలో ఆదివారం రామచంద్రపురం బార్ అసోసియేషన్ సభ్యుడి నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన జస్టిస్ సాంబశివరావు దంపతులను బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జస్టిస్ సాంబశివరావు మాట్లాడుతూ తాను స్వర్గీయ సీనియర్ న్యాయవాది పిల్లా జానికిరామయ్య వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశానన్నారు. ముఖ్యఅతిథి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రవి చీమలపాటి మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాలు ఇస్తున్న తీర్పులను అధ్యయనం చేయాలన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ కళాశాల వైస్ చాన్సలర్ డాక్టర్ డి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ భారతదేశ న్యాయవ్యవస్థ విశిష్టమైనదన్నారు. సమావేశంలో జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడారు. సీనియర్ న్యాయవాదులు నాగబాబు, ఉండవల్లి గోపాలరావులు జస్టీస్ సాంబశివరావును న్యాయవాదులకు పరిచయం చేశారు. బార్‌అసోసియేసన్ అధ్యక్షుడు పిల్లి మురళి అధ్యక్షతన జరిగిన అభినందన సభలో కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్ విశిష్ట అతిథులను ఆహ్వానించారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా జడ్జి డి.ఎల్.కామేశ్వరి, హైకోర్టు సీనియర్ న్యాయవాది సార్వభౌమారావు, జిల్లా అదనపు జడ్జి ఎం. మాధురి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జిలు నిజాం శారద, నాగేశ్వరరావు నాయక్, బార్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, డీఎస్ఎస్ శర్మ, సత్యవాణి, సీనియర్ న్యాయవాదులు మల్లిడి హరినాదరెడ్డి, ముషిని సర్వారాయుడు, పోలిశెట్టి శ్రీనివాస్, జయశంకర్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నిండు ప్రాణాలు తీసిన..మద్యం మత్తు

- నిందితుడు పాత నేరస్తుడు



పీతా దుర్గా సతీష్, చాట్ల నాగ లక్ష్మణ్ కుమార్‌ల మృతదేహం, ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటోలు

కాకినాడ క్రైం, జూలై 21 : మద్యం మత్తే కొంప ముంచింది. మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనం నడపడంతో రెండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. శనివారం అర్ధరాత్రి కాకినాడ కల్పన సెంటర్లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదానికి మద్యం మత్తే మూలకారణంగా పోలీసులు గుర్తించారు. ఈ ఘోర ప్రమాదానికి ప్రధాన కారకుడుగా ఉన్న కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన చల్లా రామ్మోహన్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పేర్రాజుపేటకు చెందిన పీతా దుర్గా సతీష్ (31), జీజీహెచ్ వెనకాల నీలావారి వీధికి చెందిన చాట్ల నాగలక్ష్మణకుమార్ (34)లు అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా, వీరి వెనకాలే బైక్‌పై వెళుతోన్న రేచర్లపేటకు చెందిన దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయాలపాలై అపస్మారకస్థితిలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. రామ్మోహన్ ప్రస్తుతం వైజాగ్‌లో ఉంటున్నాడు. ఇటీవల కాకినాడ తండ్రి ఇంటికి వచ్చాడు. ఇక్కడకు వచ్చి కొత్త కారు కొనుగోలు చేశాడు. శనివారం రామకృష్ణారావుపేటలో స్థానికంగా ఉన్నవారితో ఇతను ఘర్షణకు దిగినట్లు తెలిసింది. మద్యం మత్తులో ఘర్షణకు పాల్పడి అక్కడి నుంచి కారులో యువతి పద్మతో కలసి కారులో కల్పన సెంటర్‌వైపు వేగంగా వచ్చాడు. ఈ క్రమంలో మద్యంమత్తులో ఎదురుగా వెళుతోన్న పీతా దుర్గా సతీష్ (31), చాట్ల నాగ లక్ష్మణకుమార్ (34)లను ఢీకొట్టాడు. అలాగే మరొక బైక్‌పై వెళుతోన్న దుర్గాప్రసాద్‌కు ఢీకొట్టగా, సతీష్, లక్ష్మణ్‌కుమార్‌ల శరీర అవయవాలు విడిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణం వేగంగా వెళుతోన్న క్రమంలో బ్రేక్ వేయబోయి, ఎక్స్‌లేటర్ రేజ్ చేయడంతో వీళ్లని ఢీకొట్టి డివైడర్‌ని ఢీకొట్టి పల్టీలు కొట్టి కారు బోల్తా పడింది. ఈ ఘోరప్రమాదం చోటుచేసుకుందని ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. రామ్మోహన్‌పై సుమారు 15 చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన సంఘటనా స్థలం వద్ద కారు డోర్ నుంచి బయటకు మద్యం బాటిల్స్ రోడ్డుపై పడ్డాయి. ఆదివారం పోలీసులు మార్చురీలో ఉన్న సతీష్, నాగలక్ష్మణ్‌కుమార్‌లకు పోస్ట్‌మార్టమ్ నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మార్చురీ జరిగే సమయంలో బంధువుల ఆర్తనాదాలతో రోదనలు మిన్నంటాయి. తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్ ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రామ్మోహన్ కోలుకున్న అనంతరం విచారణ నిర్వహించడం జరుగుతుందని కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు తెలిపారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామికి లక్ష తులసి అర్చన, శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో స్వామికి సర్వపుష్పాలతో అలంకారం

దత్తనామస్మరణతో మార్మోగిన పిఠాపురం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

పిఠాపురం, జూలై 16: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంతో పాటు అన్ని దత్తక్షేత్రాలు, సాయిబాబా ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. గురుపౌర్ణమి శోభ చేకూరింది. పాదగయలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష తులసి అర్చన నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ జరిగింది. భక్తులు ఆలయం చుట్టూ ప్రదిక్షణాలు చేసి ఔదంబర వృక్షంవద్ద పూజలు చేశారు. పాదగయ ఆవరణలోని అలక్‌నిరంజన్ దత్తబృందావనంలో లక్ష గులాబి అర్చన, లక్షతులసి అర్చన, విశేష పుష్పార్చనలు నిర్వహించారు. పల్లకిసేవ, ఊయలసేవ,సాయినాధునికి విశేష అలంకారం చేశారు. భారీ అన్న దానం నిర్వహించారు. దత్తగురువు వాడ్రేవు శ్రీనివాసరావు పూజాది కార్యక్రమా లు జరిపించారు. ఆలయఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీపాదవల్లభ సంస్థానంలో...

పట్టణంలోని శ్రీపాదవల్లభ మహాసంస్థానంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సర్వపుష్పార్చన జరిగాయి. దత్త హోమం నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయుడు, నృసింహసరస్వతులకు సర్వపుష్పాలంకారం చేశారు. ఉభయతెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు తరలివచ్చారు. ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలు కట్టి ప్రదిక్షణలు చేశారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ జరిగింది. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, లక్ష్మీదేవి దంపతలు ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాదికారి సౌజన్య పాల్గొన్నారు.

వెటర్నరీ ఎన్‌జీఓఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



ఆలమూరు, జూలై 21: ఏపీ వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేడ్ ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా పినపళ్ల పశువైద్యాధికారి ఈదల శ్రీనివాస్‌చౌదరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఈదల శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యక్షులుగా కేవీ రామరాజు, రుక్మతరావు, అప్పన్నబాబు, సహాయ అధ్యక్షుడిగా ఎస్.వీర్రాజు, కార్యదర్శిగా సాంబమూర్తి, కోశాధికారిగా ఎం.రామారావు, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.శ్రీనివాస్, ఆర్‌వీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

శెట్టిపేటలో వివాహిత హత్య



నిడదవోలు, జూలై 21: నిడదవోలు మండలం శెట్టిపేటకు చెందిన కురసాల నవ్య (28) ఆదివారం తెల్లవారుజామున హత్యకు గురైంది. మృతురాలి తండ్రి యరగం శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పెరవలి మండలం అన్నవరప్పాడుకి చెందిన నవ్యతో శెట్టిపేటకి చెందిన తాపీ పనిచేసే కురసాల చిరంజీవికి 12ఏళ్ల క్రితం వివాహమైంది.వారికి ముగ్గురు కుమార్తెలు గీతిక(10), తేజశ్రీ(7), జాహ్నవి(4) ఉన్నారు. నవ్యను చిరంజీవి అనుమానంతో వేధిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున టైలరింగ్ కత్తెరతో తన కుమార్తెను హత్య చేశాడని శ్రీనివాసు ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఈ సంఘటనపై నిడదవోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇగ్నో కోర్సుల్లో ప్రవేశానికి గడువు పెంపు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 21 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి (జూలై 2024 సెషన్) వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును జూలై 31వరకూ పొడిగించినట్టు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ తెలిపారు. యూజీసీ ద్వంద్వ డిగ్రీ ప్రోగ్రాంలకు ఆమోదం తెలిపిందన్నారు. దీని ద్వారా విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీలు చేయవచ్చని తెలిపారు. సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో ఈ నెలాఖరు వరకూ ప్రవేశాలు లభిస్తాయని తెలిపారు.

వాటర్ ట్యాంకులో పడి ఆపరేటర్ మృతి



సలాది రక్షణ ఆనంద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 21: కాకినాడ అర్బన్ 2వ డివిజన్ బొందగుంటలోగల విజయలక్ష్మి వాటర్ ప్లాంటులో గల వాటర్ ట్యాంకులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెంనకు చెందిన సలాది రక్షణ ఆనంద్ (40) కాకినాడ లచ్చిరాజువారి వీధిలో భార్య మాణిక్యాంబ, ఇద్దరు కుమారులతో నివసిస్తున్నాడు. ఇతను బొందగుంటలో గల విజయలక్ష్మి వాటర్ ప్లాంటులో ఆపరేటర్ కమ్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి 8గంటలకు విధుల్లో చేరాడు. వాటర్ ప్యూరిఫికేషన్ ప్రక్రియలో నీటిని పరీక్షించేందుకు వాటర్ ట్యాంకులోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందినట్లు నిర్వాహకులు మృతుడు తండ్రి రాజేశ్వరరావు, పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. తండ్రి సంఘటనా స్థలానికి చేరుకుని కుమా రుడు మృతదేహం చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు. భార్య, ఇద్దరు కుమారులకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి న్యా యం చేసే వరకు మృతదేహన్ని పోస్ట్‌మార్టమ్‌కి తరలించేదిలేదని ఆందోళన చేశారు. సంఘటనా స్థలానికి సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ చేరుకుని మృతదేహన్ని పరిశీలించి, ప్రమాదానికిగల కారణాలపై వివరాలు సేకరించారు. మృతుని తండ్రి రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేయాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. వాటర్ ప్లాంటు శుద్ధి చేసేందుకు అనుమతులపై ఉభయ గోదావరి జిల్లాల ఫ్యాక్టరీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడగా ఎటువంటి ప్లాంటు ఏర్పాటుకు అనుమతులు లేవని, క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సోమవారం అధికారులను పంపిస్తానని సదరు అధికారి ఎమ్మెల్యేకు చెప్పారు. ఈ సందర్భంగా బంధువులు, నిర్వాహకుల మధ్య చర్చలు జరిపి నష్టపరిహారం అందించేందుకు అంగీకరించడంతో మృతదేహన్ని తరలించారు.

భార్య రొయ్యలకూర వండలేదని.. భర్త ఆత్మహత్య

గొల్లప్రోలు, జూలై 21: భార్య చెప్పిన కూర వండలేదని కోపగించిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా చికిత్సకు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం రంగప్పచెరువు ఏరియాకు చెందిన బండి బుచ్చిరాజు(25), దుర్గాభవానీకి అయిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. స్థానికంగా ఉన్న రైతు కమతంలో పనిచేసే బుచ్చిరాజు శనివారం రాత్రి ఇంటికి వచ్చి తనకు ఆకలి వేస్తుందని తొందరగా భోజనం పెట్టమని అడిగాడు. ఏమి కూర వండావని అడగగా, కోడిగుడ్లు కూర వండుతున్నానని భార్య దుర్గాభవానీ చెప్పింది. తాను ఉదయం వెళ్లేటప్పుడు రొయ్యలకూర వండమంటే ఈ కూర ఎందుకు వండుతున్నావంటూ పొయ్యి మీద కూర పాత్రను గెంటేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో నూకరాజు ఇంటి నుంచి కోపంగా వెళ్లిపోయాడు. రాత్రి 11గంటల సమయంలో తన భర్త నూకరాజు ఇంటికి వచ్చి లోపలకు వెళ్లి తలుపు వేసుకున్నాడని, చూస్తే ఏదో తాగుతున్నట్లు అనిపించడంతో ప్రశ్నించగా పురుగుల మందు తాగినట్లు చెప్పాడని భార్య దుర్గాభవానీ పోలీసులకు తెలిపింది. దీంతో తన తల్లి సహాయంతో వెంటనే కుంకుడుకాయ రసం తాగించగా వాంతు చేసుకోగా, అక్కడి నుంచి పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో చనిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యలో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

మామిడికుదురు, జూలై 21: విద్యలో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం సంఘ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత ఏడాది ప్రతిభకనబర్చిన ఎస్సీఎస్టీ విద్యార్థులకు రూ.1.20లక్షలువిలువైన ప్రతిభా పురస్కారాలనుఅందించారు.ఎంపీపీ కుసుమ వనజాకుమారి, సంఘజిల్లాఅధ్యక్షుడు బత్తుల నకులరాజు పాల్గొన్నారు.

- ఇంకా వీడని వరద ముంపు
- పంట చేలు, పల్లపు ప్రాంతాలు నీట మునక
- ఎమ్మెల్యేలు, అధికారులు పర్యటన

వరద గోదావరి పరవళ్లు


అలమూరు: జొన్నాడ రెండు వంతెనల మధ్య గోదావరి పరవళ్లు

ముమ్మిడివరం, జూలై 21: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో వరి పొలాలు ఇంకా ముంపు నుంచి తేరుకోలేదు. వేసిన వరి నాట్లు, నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్న నారు నాలుగు రోజులుగా ముంపులోనే ఉండడంతో వాటికి నష్టం కలిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముమ్మిడివరం మండలంలో వృద్ధ గౌతమీ, అయినాపురం, ప్రధాన మురుగునీటి కాల్వల వెంబడి ఉన్న వరి పొలాలు, నీటితో మునిగి ఉండడంతో అవి దెబ్బతింటున్నాయి. అయినాపురం, కొత్తలంక, సీహెచ్.గున్నేపల్లి తదితర గ్రామాల్లో వరి పొలాలను సర్‌ప్లస్ వియర్ ద్వారా వచ్చే నీరు ముంచెత్తుతుంది. వర్షాలు కురవడంతో పాటు గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో మురుగునీరు బయటికి వెళ్లే మార్గం లేదు. మురుగునీటిని గోదావరిలోకి విలీనం చేసే అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల షట్టర్లను మూసివేయడంతో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోయింది. బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంటకాల్వలోని మిగులు నీటిని అయినాపురం సర్‌ప్లస్ వియర్ ద్వారా ఆ నీరు మురుగుకాల్వలోకి చేరి వరి పొలాలను ముంచెత్తుతోంది. దీంతో వరి పొలాలు ముంపు నుంచి బయట పడడంలేదు. రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే వరి పైరు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. గోదావరి ఎగువన వరద ఉధృతి పెరగడంతో మండలంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. గోదావరిలో నాటు పడవలపై ప్రయాణాలు సాగించరాదని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ కొనసాగుతుంది.

అలమూరు: గోదావరికి వరదనీరు క్రమక్రమంగా పెరుగుతుండటంతో జొన్నాడ వద్ద వరద గోదావరి రెండు బ్రిడ్జిల మధ్య పరవళ్లుతొక్కుతోంది. మండలంలో బడుగువానిలంకతో పాటు పలు గ్రామాల్లోని లంక భూములకు వరద నీరు చేరుకుంటుంది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వేసవి తరువాత వేసిన పలు రకాల వాణిజ్య పంటలు చేతికందే సమయంలో వరద ఆందోళన కలిగిందని రైతులు వాపోతున్నారు. జొన్నాడ వద్ద పరవళ్లు తొక్కుతున్న వరద గోదావరిని ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మలికిపురం: కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గ్రామాల్లో ముంపు నీరు దిగక రోడ్లన్నీ కాల్వల్లా ప్రవహిస్తున్నాయి. అధికారులు గ్రామాల్లోని కచ్చా బోదెలను వెంటనే బహిర్గతం చేయించాలని రైతులు కోరుతున్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో వరద ప్రాంతాలను తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసు అధికారులు ఆదివారం పర్యటించారు. సఖినేటిపల్లింక రేవు, బాడిరేవు, అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం తదితర వరద ఉధృతి ప్రాంతాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. వరద లంక గ్రామాల్లోకి రాకముందే పునరావాస కేంద్రాలకు తరలిరావాలని లంక వాసులను కోరారు. వైద్య, విద్యుత్ శాఖల అధికారులు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ పెద్దిరాజు, మడిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో సత్యనారాయణ, పోలీసు, అధికారులు పాల్గొన్నారు.

యానాం: యానాంలో వరద పరిస్థితిపై పరిపాలనాధికారి మునిస్వామి ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఏమునిస్వామి మాట్లాడుతూ ముంపు ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని, వరద నేపథ్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన ముంపు ప్రాంతాలను పరిశీలించారు. వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తున్నానన్నారు.

కపిలేశ్వరపురం: గోదావరి నదికి వరద ఉధృతి గంట గంటకు పెరుగుపోతున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలు తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారి లంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలుచోట్ల లంక పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు లోతట్టు ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లోకి నీరు చేరింది. వరద ఉధృతి కారణంగా కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కరఘాట్లకు నీరు చేరింది. మత్స్యకారులు ఇంజన్ బోట్లను ఒడ్డుకు చేర్చారు. మరింత ఉధృతి పెరిగితే లంకగ్రామాలు వరదనీటిలో చిక్కుకుంటాయి. మండలంలోని పలు చోట్ల బలహీనంగా ఉన్న ఏటిగట్టు ప్రాంతాలను రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ ఆదివారం పరిశీలించారు. కోరుమిల్లి శివారు ఏటిగట్టును పరిశీలించి పరిస్థితిపై ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరదల పట్ల అధికార్లు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



యానాం: వరద ఉధృతి పరిశీలిస్తున్న ఆర్ఏ, మామిడికుదురు: పెదపట్నంలంకలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి: గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గౌతమీ, వృద్ధగౌతమీ పాయలు పోటెత్తాయి. నదీ పరివాహక ప్రాంతాలైన లంక భూముల్లో పంటలు మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పశుగ్రాసాలు ముంపునకుగురికావడంతో పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు.

మామిడికుదురు: ఎగువన భారీ వర్షాలు కురవడంతో గోదావరికి క్రమేణా వరద నీటిమట్టం పెరుగుతోంది. పాశర్లపూడి వంతెన కింద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి తదితర లంక గ్రామాల ప్రజలు వరద పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.ఆయా గ్రామాల ప్రజలు పల్లపు ప్రాంతాల్లో ఉన్న వస్తువులను మెరకప్రాంతాలకు చేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. పెదపట్నం మధ్యలంక నుంచి రైతులు పశుగ్రాసాన్ని ఒడ్డుకు తెచ్చుకుంటున్నారు.

రావులపాలెం: మండలంలోని పంట పొలాల్లోకి భారీగా మురుగునీరు వచ్చి చేరింది. వర్షం ఆదివారం కొంత తగ్గినప్పటికీ నాట్లు వేసిన పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ముంపు బారిన పడి నాలుగు రోజులు గడవడంతో నాట్లు దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల కారణంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఛిద్రమైన రహదారులపైకి వర్షం నీరు చేరింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కె.గంగవరం: సుందరపల్లి వద్ద ఏటిగట్టును నీటిపారుదల అధికారులతో కలిసి రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ పరిశీలించారు. ముందస్తు చర్యగా 9వేల ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఏటిగట్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది ఏటిగట్టును పర్యవేక్షిస్తూ ఏమైన విషయం ఉంటే సమాచారం అందించాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరాలరేవు వద్ద పైమెట్ల వద్ద వరకు గోదావరి చేరింది. లంక పొలాలు మంపులోనే ఉన్నాయి.

ఆత్రేయపురం: ఆదివారం వర్షం లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రెయినేజీలు, మురుగు కాల్వలను శుభ్రంచేయడంతో పంటపొలాలు, పల్లపు ప్రాం తాల నుంచి డ్రైనేజీల ద్వారా ముంపు నీరుదిగుతోంది. గోదావరికి వరద పోటు తగలడంతో పిచ్చుకలంక, వాడపల్లిలంకల్లో నివసిస్తున్న ప్రజలను అధికారులు అప్రమత్తంచేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోఏర్పాట్లలో అధికారులునిమగ్నమయ్యారు.

యనమదలలో దెబ్బతిన్న వంతెన

ద్రాక్షారామ, జూలై 21: యనమదల నుంచి రామచంద్రపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో యనమదల వద్ద వంతెన దెబ్బతింది. ఆ వంతెనను ఆర్డీవో ఎస్.సుధాసాగర్ ఆదివారం పరిశీలించారు. భారీవాహనాలు రాకపోకలతో వంతెను దెబ్బతిన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' గతంలో వెలుగులోనికి తెచ్చింది. ప్రస్తుతం వంతెన పూర్తి శిథిలస్థితికి చేరకుని ప్రమాదభరితంగా మారింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మేల్కొని ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఉన్నారు.

వీరేంద్రను స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు


వీరేంద్ర కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీవో

అంబాజీపేట, జూలై 21: కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలతో భారత రాయబారి కార్యాలయం ద్వారా సౌదీలో ఇబ్బంది పడుతున్న సరెళ్ల వీరేంద్రకుమార్‌ను ఇసుకపూడి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఇసుకపూడిలో వీరేంద్ర కుటుంబ సభ్యులతో ఆర్డీవో మాట్లాడి వారికి ధైర్యం కల్పించారు. తహసీల్దారు జె.విమలకుమారి, సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, టీడీపీ నాయకుడు పళ్ళ శ్రీనివాసరావు, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వో పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించండి


ఉప్పలగుప్తం,జూలై 21: తమకాలనీని ముంపునుంచి కాపాడాలని మునిపల్లి కాలనీ వాసులు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రం సమర్పించారు. ఆక్రమణకు గురైన బోదెను తవ్వించి కాలనీకి ముంపు బెడద లేకుండా చూడాలన్నారు. పి.భూలక్ష్మి, కట్టా శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, వై.సత్యప్రసాద్ వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూలై21:వాడపల్లిలో అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన పకలపాటి మోహన్‌సిద్ధకిషోర్-అనురాధ దంపతులు రూ.1.05లక్షలు విరాళం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు




కొత్తపేటలో సాయిబాబా, అంబాజీపేట: వాకలగరువలో జీడిపప్పు దండతో సాయిబాబా, కపిలేశ్వరపురం: వల్లూరులో సాయిబాబా

ముమ్మిడివరం, జూలై 21: గురుపౌర్ణమి వేడుకలను మండలంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. షిర్డి సాయి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ముమ్మిడివరంలోని సాయిబాబా మందిరం వద్ద ఉదయం కాకాడ హారతి, మధ్యాహ్న హారతి, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి సేజ్ హారతి నిర్వహించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా పలువురు గురువులను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

అల్లవరం: అల్లవరంలో షిర్డి సాయిబాబాను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. బండిగుప్తావు పాండురంగ, భార్గవ్ ఆధ్వర్యంలో మంత్రితో పాటు గంధం పల్లంరాజు, అమలాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్‌లను ఘనంగా సన్మానించారు. బాబా వారికి అభిషేకాలు, పూజలు జరిగాయి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మోకా వెంకటసుబ్బారావు, అరిగెల వెంకటరామారావు, సుంకర సాయి, బండిగుప్తావు సత్తిబాబు, అడపా శ్రీనివాసరావు, నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్‌కుమార్ బాబాను దర్శించుకున్నారు. కొమరగిరిపట్నం, గోడిలంక, డి.రావులపాలెం షిరిడి సాయి మందిరాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి.

రావులపాలెం: రావులపాలెం, ఈతకోటలతో పాటు పలు గ్రామాల్లోని బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. బాబాకు హారతులిచ్చి ఆయన్ను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆత్రేయపురం: వాడపల్లిలోని సత్యసాయిబాబా భజన మందిరంలో షిరిడి సాయిబాబా విగ్రహావిష్కరణ, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. యజుర్వేద పండితుడు సాయి కృష్ణశర్మ, సామవేద పండితుడు మణికుమార్‌శర్మలను సత్క రించారు. బాలవికాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకుడు సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. కన్వీనర్ ఏపుగంటి బాలాజీ, సేవాదళ్ కో-ఆర్డినేటర్ సాధనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని సాయిఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గొల్లవిల్లి, భీమనపల్లి, చల్లపల్లి, కూనవరం, నంగవరం, విలసవిల్లి,పెదగాడవిల్లి గ్రామాల్లోని సాయి ఆలయాల్లో భక్తులు సాయిసంకీర్తనలతో ప్రత్యేక పూజలు చేశారు.

అలమూరు: గురుపౌర్ణమి సందర్భంగా షిర్డిసాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలమూరు, జొన్నాడ, మూలస్థానం, నర్సిపూడి షిర్డిసాయి ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలమూరు షిర్డి సాయిబాబాను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి విచ్చేశారు. భక్తమండలి ఆధ్వర్యంలో భజనలు, బాబా భక్తి గీతాలను ఆలపించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో వేంచేసియున్న భీమషిర్డిసాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున కాకడహారతి నిర్వహించారు. తదుపరి పంచామృత అహిషేకాలు జరిపారు. 2వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్తి సుబ్బారెడ్డి, అధ్యక్షుడు పోతంశెట్టి రాంబాబు, కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి పేపకాయలకృష్ణ, పేరూరి వీర్రాజు, మేకా కుమార్, ఆళ్లభీమశంకరం, పాపాజీ పాల్గొన్నారు.

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెం, చిరతపూడి, వాకలగరువు, గంగలకుర్రు అగ్రహారం తదితర గ్రామాల్లో ఉన్న బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. బాబా విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. వాకలగరువో శ్రీసంతాన సిద్ధివినాయక దత్తాత్రేయ షిరిడిసాయిబాబాకు గ్రామానికి చెందిన భక్తుడు పేరాబత్తుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన 4కేజీల జీడిపప్పు దండను ఆదివారం అలంకరించారు. అనంతరం జీడిపప్పు దండను కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు.

కపిలేశ్వరపురం: వల్లూరులో షిర్డీసాయి బాబాకు కాగడ హారతి, నగర సంకీర్తన, దత్తాత్రేయునికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కపిలేశ్వరపురం, కోరుమిల్లి, నల్లూరు, కాలేరు తదితర గ్రామాల్లో బాబాకు పూజలు అనంతరం అన్నసమారాధనలు నిర్వహించారు.

కె.గంగవరం: గురుపౌర్ణమి పూజలు ఆదివారం పామర్రు, పాణింగపల్లి, సత్యవాడ, అమజూరు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాయిబాబా ఆలయాలు వేకువజాము నుంచి భక్తులతో కిటకిలాడాయి. సాయిబాబాకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

మామిడికుదురు: మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, మొగలికుదురు తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా చేశారు. పెదపట్నంలోని షిర్డిసాయినాథున్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకుని పూజలు చేశారు. మామిడికుదురు బస్టాండు కూడలి వద్ద గురుపౌర్ణమిని పురస్కరించుకుని భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరం అక్విడెక్టు వద్ద శ్రీషిర్డీసాయి, సత్యసాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివార్కి ఆలయ కమిటీ చైర్మన్ చొల్లంగి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు రాంబాబు ఆచార్యులు బ్రహ్మత్వంలో పాలా భిషేకం, తులసి దళాలతో విశేషపూజలు నిర్వహించారు.అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నస మారాధన జరిగింది. సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక విద్యాశాఖ పరిధిలోని జవహర్ మినీ బాలభవన్‌లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పూర్వ విద్యార్థినులు ప్రత్యూష, మానసల మాతృమూర్తులు అనురాధ, భాగ్యలక్ష్మిలు చిన్నారుల సమక్షంలో గురువు శ్రీవాత్సవిని సత్కరించి నూతన వస్త్రాలు, వెండి ప్రతిమ, ఉంగరం అందజేశారు. బాలభవన్ సూపర్‌వైజర్ చింతా కొండలరావు గురుపౌర్ణమి విశిష్టను చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: స్థానిక బూరుగుంట సాయిబాబా ఆలయంలో సాయిబాబాను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తర్వాణిపేట, పాటిమీద, జెడ్.మేడపాడు, ద్వారపూడి, కేశవరం, ఏడిద, పాలతోడు, వెలగతోడు, అర్తమూరుగ్రామాల్లో బాబావారి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి బాబాఆలయాల్లో పూజలు అభిషేకాలు చేశారు. అన్నసమారాధన నిర్వహించారు.

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఠం వేద పండితుల ఆధ్వర్యంలో దత్తాత్రేయ, శ్రీకృష్ణుడు, సాయిబాబాలకు అష్టోత్తర సహస్రనామాలతో కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదిశంకరాచార్యులు, శృంగేరి పీఠాధిపతులు అభినవ విద్యాభారతి పాదుకులకు గురు అష్టోత్తరాలతో గురుపాదుకా పూజలు, పుష్పార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. భక్తులు గాడ్‌కు పాదపూజలు, మంగళహారతుల నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి జ్ఞానమార్గంలో నడిపించే విశిష్టమైన వ్యక్తి గురువేనన్నారు. ఆధ్యాత్మికత ప్రవర్తనతో చింతలు తొలగుతాయన్నారు. దైవారాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీబాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి), పీఠం ప్రతినిధులు గాదే సత్య వెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, వేదపండితుడు చిమలకొండ వీరావధాని, అర్చకుడు చక్రవర్తుల మాధవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు. రాయవరం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు, హారతులు నిర్వహించారు. వెదురుపాక, పసలపూడి బస్టాండ్ సెంటర్‌లో బాబా ఆలయాల్లో, చెల్లూరు సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కొత్తపేట: కొత్తపేట షిరిడి సాయి మందిరంలో సాయినాథునికి ప్రధానార్చకుడు కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరపగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మందపల్లిలో పార్వతీ సమేత మందేశ్వరస్వామి ప్రాంగణంలో లలితా పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారికి పంచ హారతులు ఇచ్చి దీపాలంకరణ చేసినట్టు సహాయ కమిషనరు, ఈవో విజయలక్ష్మి తెలిపారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం: ఎమ్మెల్యే

ముమ్మిడివరం, జూలై 21: వర్షాలకు నష్టపోయిన వరి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) హామీ ఇచ్చారు. అన్నంపల్లి, కొత్తలంక గ్రామాల్లో ముంపు బారిన పడిన వరి చేలను ఆదివారం ఆయన పరిశీలించారు. వర్షాలకు నష్టపోయిన రైతుల విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఇబ్బందిపై సోమవారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు తీసుకువస్తామన్నారు. వర్షాలే ప్రధాన కారణం కాదని, డ్రెయిన్ల ఆక్రమణ, సర్‌ప్లస్ వియర్ నుంచి నీరు పంట కాల్వలోకి ఎగదన్ని చేలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి నీట మునిగిన నష్టపోయిన వరి పొలాలకు పరిహారం అందించడంతో పాటు ఆక్రమణకు గురైన డ్రెయిన్లను ఆధునీకీకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, పొద్దోకు నారాయణ, చెల్లి అశోక్, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, నడిమింటి సూర్యప్రభాకరం, దాసరి సుమలత, దాసరి సాయిబాబు, పొత్తూరి విజయభాస్కరవర్మ, చిక్కాల అంజి, గీసాల చంద్రరావు, బోనం కృష్ణ, వీహూరి సత్యనారాయణరాజు, వీహూరి నాగరాజు వర్మ, మట్ట సత్తిబాబు, సత్తి నూకరాజు, తోలేటి రాంబాబు, మహాదశ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు సత్కారం

అల్లవరం,జూలై21: కోడూరుపాడుగుబ్బలవారిపాలెంలో టీడీపీ నాయకుడు గుబ్బల రామ్‌ప్రసాద్(చినబాబు) ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గంధం పల్లంరాజు, చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, వాసంశెట్టి చినబాబు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ



అమలాపురం టౌన్, జూలై 21: జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం అమలాపురంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శ్రీరామపురంలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

బుద్ధవిహార్‌లో గురుపౌర్ణమి వేడుకలు



అమలాపురం టౌన్, జూలై 21: గురు పౌర్ణమి వేడుకలను అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో గౌతమ బుద్ధునికి పూజలు జరిపారు. బుద్ధవిహార్ ప్రతినిధులు డీబీ లోక్, నాగాబత్తుల ప్రసాదరావు, కాశి పరశురాంబోధి, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, ములపర్తి సత్యనారాయణ, జంగా రాజేంద్ర పాల్గొన్నారు. శ్రీకామాక్షీ పీఠంలో బాలబ్రహ్మచారి విఘనస రాజీవ్‌ప్రేమ్, గోవిందవర్జుల నాగబాబుశర్మ ఆధ్వర్యంలో గురు పూజామహోత్సవం నిర్వహించారు. పీఠాధిపతి కామేశమహర్షి గురుపౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులతో పాటు బీజేపీ నాయకులు కామేశమహర్షిని గురువుగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, ఆర్వీనాయుడు, చిట్టూరి రాజేశ్వరి, జగతా శాంతి, కొండేటి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. భూపయ్య అగ్రహారం, ఎర్రవంతెన వద్దనున్న షిర్డిసాయి స్వర్ణ మందిరాల్లో ఆలయ ధర్మకర్త పేరి బాలకామేశ్వరరావు (కొండబాబు), మేడిచర్ల సాయిరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.భక్తులకు అన్నసమారాధన జరిగింది. మెట్ల రమణబాబు, జంగా అబ్బాయివెంకన్న, బొర్రా ఈశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, జూలై 21: వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఆదివారం పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం తదితర వరద ప్రభావిత గ్రామాల్లో ఆయన పర్యటించారు. వరద పెరిగినా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కిడ్నీ బాధితుడికి మంత్రి సుభాష్ సాయం

కొత్తపేట,జూలై21: బిళ్లకుర్రు శివారుమట్టపర్తివారిపాలేనికి చెందిన మట్టపర్తి వెంకటేష్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి రూ.40వేలు సమకూర్చింది. ఆ మొత్తానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10వేలుజతచేసి మొత్తంగా రూ.50వేలను ఆదివారం అందజేశారు.

వర్షాలకు కూలిన రెయిలింగ్

ఆత్రేయపురం, జూలై21: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మెర్లపాలెంలో మావుళ్లమ్మ గుడి సమీపంలో ఉన్న కాలిబాట వంతెనపై రైలింగ్ ఆదివారం కూలిపోయింది. ఐరన్‌పోల్స్‌తో తాత్కాలికంగా రెయిలింగ్ ఏర్పాటు చేశారు.

అమ్మవార్లు శాకంబరిగా దర్శనం



ముమ్మిడివరం జూలై 21:: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి అమ్మవారిని పలు రకాల పండ్లతో ముగ్ధ మనోహరంగా అలంకరించారు. గొలకోటి వెర్రిబాబు, వాండ్రపు భాస్కరరావు ఆర్థిక సహాయంతో అమ్మవారికి బూరెలు, చక్కరపొంగలి నైవేద్యంగా సమర్పించారు. సలాది కిశోర్ ఆర్థికసాయంతో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమ్మవారి సన్నిధికి విచ్చేసిన చిన్నపిల్లలకు గొలకోటి వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచితంగా పాలు పంపిణీ చేశారు. చింతలపూడి రాజేష్‌స్వామి భజన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఆర్డీవో కేశవర్ధనరెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు.

అంబాజీపేట: అంబాజీపేట పశువుల సంతమార్కెట్ వేంచేసియున్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్ భక్తులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈసందర్భంగా అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేట కన్యకాపరమేశ్వరి అమ్మవార్కి స్థానిక ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో 150మంది మహిళలు సమకూర్చిన 31రకాల స్వీట్లు, పండ్లు, వస్త్రాలను సారెగా సమర్పించారు.

రాయవరం: వెదురుపాక-అరికరేవుల రోడ్డులో పంట పొలాల్లో ఉన్న శ్రీసత్తెమ్మ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవార్ని ఆలయ నిర్వాహకుడు మాచవరపు వెంకట సురేష్ ఆధ్వర్యంలో రాయవరానికి చెందిన కూరగాయల వ్యాపారి కాకి సత్యసాయి మణికంఠ సమకూర్చిన 25కిలోల వివిధ రకాల కూరగాయలతో అమ్మవార్ని శాకంబరిగా అలంకరణ చేశారు.

కొత్తపేట: కొత్తపేట శివారు బొరుసువారిసావరంలో విజయదుర్గమ్మ అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.

ముత్యాలమ్మకు వెండి గరగలు అందజేత

కె.గంగవరం, జూలై 21: కోటిపల్లి గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం గ్రామానికి చెందిన సూర్య భాస్కరశర్మ కుటుంబ సభ్యులు రూ.2లక్షల విలువైన వెండి గరగలను అందజేశారు.

కోడి రామకృష్ణ ప్రతిభా పురస్కారానికి శిల్పి వడయార్ ఎంపిక

కొత్తపేట, జూలై 21: లెజండ్రీ డైరెక్టర్ కోడి రామకృష్ణ ప్రతిభా పురస్కారానికి కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి రాజకుమార్ వడయార్ ఎంపికయ్యారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆయన్ను అవార్డుతో సత్కరించనున్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

రావులపాలెం, జూలై 21: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మపేరుతో మొక్క నాటే కార్యక్రమం నిర్వహించారు. రావులపాలెం ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ఆధ్వర్యంలో బంగారు పాపమ్మ గుడి వద్ద బీజేపీ రాష్ట్ర పదాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి మొక్కలు నాటారు. కృష్ణారెడ్డి, మంచిగంటి కృష్ణ, శేషారెడ్డి, సీహెచ్ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యను కాషాయీకరణ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం


సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్

అమలాపురం టౌన్, జూలై 21: కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ ఆరోపించారు. విద్యార్థుల్లో మూఢ నమ్మకాలను, మతోన్మాద భావజాలాన్ని పెంపొందించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. భారత విద్యార్థి ఫెడరేషన్, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం ఎంప్లాయిస్ హోంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ ఆధారిత సమాజ నిర్మాణంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహన్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వల్ల వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ నాయకత్వంలో విద్యార్థులకు సైన్స్, గణితం, ఆంగ్ల భాషలపై అవగాహన కల్పించారు. ప్రముఖ మెజీషియన్ చింతా శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేజిక్ షో ఆకట్టుకుంది. కె.గణేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, మురుగేశ్వరరావు, జీవీ రమణ, ప్రజాసంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరరావు, గుదే దుర్గాప్రసాద్, టి.నాగవరలక్ష్మి, పి.అమూల్య, బేబీగంగారత్నం తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ప్రేమ్‌కుమార్, సహ కన్వీనర్లుగా శశి, సత్యప్రసాద్, వాసంతితోపాటు 20 మంది సభ్యులను ఎన్నుకున్నట్టు బీఎన్ వెంకటేశ్వరరావు, బీఎస్ శివకుమార్, బీమాల శ్రీను తెలిపారు.

కంకిపాటి సోదరులకు ప్రముఖుల పరామర్శ

అల్లవరం,జూలై21: అల్లవరంలో కంకిపాటి నారాయణమ్మ మృతితోమాతృవియోగంతో బాధపడుతున్న జనసేన నాయకులు కంకిపాటి పెదబుజ్జి, కంకిపాటి వీరబాబులను పలువురు ప్రముఖులు పరామర్శించారు. బీజేపీ జిల్లాఅధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మోకా వెంకట సుబ్బారావు, కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, చిక్కం భీముడు, బండిగుప్తావు కృష్ణ, అయితాబత్తుల ఉమామహేశ్వరావు, ఆకుల బుజ్జి, ఇసుకపట్ల రఘుబాబు, కటికిరెడ్డి బాబి, రొక్కాల నాగేశ్వరరావు, చాట్ల మంగతాయారులు కంకిపాటి సోదరులను పరామర్శించారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

ఆలమూరు, జూలై 21: నలుగురు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు లభించాయి. నర్సిపూడి, చెముడులంక, మూలస్థానఅగ్రహారం, చెముడులంక, బడుగువానిలంక పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శులు ఆర్‌వీవీ.సత్యనారాయణ, యు.రేణుక, పి.రాజు, కె.సుప్రియలకు గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. సత్యనారాయణ తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించారు. మిగిలిన ముగ్గురు కోనసీమ జిల్లాలోనే కొనసాగనున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

యానాం, జూలై 21: యానాం శివారు గిరియంపేటలోని పెరుంతలైవర్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2013-14 ఏడాది పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 50మంది పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దంగేటి త్రిమూర్తులు, దాట్ల శ్రీకాంత్ వర్మ, పెసల జయరామయ్య, టిల్లపూడి సుబ్రహ్మణ్యం, వీపీఎస్ఎన్ కిషోర్, వి.వి.వినాయకరావు, కె.గంగరాజు, పి.రోజారాణి, నళిని పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రెవెన్యూ లైసెన్స్డ్ సర్వేయర్లు



ముమ్మిడివరం, జూలై 21: రెవెన్యూ లైసెన్స్డ్ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ లైసెన్స్డ్ సర్వేయర్ల అసోసియేషన్ సీఎం చంద్రబాబుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మంగళగిరిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును రెవెన్యూ లైసెన్స్డ్ సర్వేయర్ల అసోసియేషన్ బృందం కలిసి తమ సమస్యలు మొర పెట్టుకున్నారు. రెవెన్యూ లైసెన్స్డ్ సర్వేయర్లను తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ సర్వేయర్లగా నియమించి న్యాయం చేయాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మండల అసిస్టెంట్ సర్వేయర్లుగా నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని, అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం గ్రామ సర్వేయర్లను నియమించి తమ నోట్లో మట్టి కొట్టారని, తామంతా ఉపాధి లేక రోడ్డున పడ్డామని మొర పెట్టుకున్నారు. తమ విన్నపంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి న్యాయంచేస్తారని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈబృందంలో జి.శ్యామ్‌కుమార్, మనోహర్, కిరణ్, లీలాకృష్ణ పాల్గొన్నారు.

రహదారిపై ఆబోతుల వీరంగం

ఉప్పలగుప్తం, జూలై 21: సిరిపల్లి-మునిపల్లి రహదారిపై ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం మూడు ఆబోతులు యుద్ధానికి తలపడ్డాయి. కారణం ఏమిటో తెలియదు గానీ రహదారిపై గంటసేపు వీరంగం సృష్టించాయి. ఆబోతుల పోట్లాటలో రహదారి పక్కన పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. వాటిని తరిమికొట్టేందుకు స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గంట తర్వాత అక్కడి నుంచి నిష్క్రమించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.